# సాక్షి
## పశ్చిమగోదావరి

శనివారం । 14 । సెప్టెంబర్ । 2024




### వర్జీనియా అ'ధర'హో
వర్జీనియా ధర రికార్డులు సృష్టిస్తోంది. శుక్రవారం నాలుగు కేంద్రాల్లో రూ.400 మార్కును తాకింది. జంగారెడ్డిగూడెం కేంద్రంలో రూ.407 ధర నమోదైంది. 8లో ▸



### 'వరద' వసూళ్లు !
వరదలను అడ్డుపెట్టుకుని విరాళాల పేరుతో భారీగా వసూళ్లకు కొందరు రంగంలోకి దిగారు. జిల్లాలో రూ.5 కోట్ల వసూళ్లను లక్ష్యంగా నిర్ణయించినట్టు తెలిసింది. 8లో ▸



### ఖనిజ మిశ్రమాలు తప్పనిసరి
పాడి పశువుల ఆరోగ్యం, ఉత్పాదకతలో ఖనిజ మిశ్రమాలది కీలక పాత్ర. వ్యాధి నిరోధక శక్తి పెంచడంతో పాటు పాల ఉత్పత్తిని మెరుగుపరుస్తాయి. 8లో ▸

## న్యూస్‌రీల్

### మత సామరస్యానికి దోహదం



గునుపూడి స్తూపం సెంటర్‌లో వినాయకుడికి పూజలు చేస్తున్న మోషేను రాజు

భీమవరం: వినాయక చవితి ఉత్సవాలు మత సామరస్యానికి దోహదం చేయాలని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు అన్నారు. భీమవరం పట్టణం గునుపూడి స్తూపం సెంటర్‌లో శుక్రవారం వినాయక మండపాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మోషేను రాజు అన్నసమారాధన ప్రారంభించారు.

### చెవి, ముక్కు, గొంతులను సంరక్షించుకోవాలి




రాష్ట్రస్థాయి చెవి ముక్కు గొంతు వైద్యుల వార్షిక సమావేశాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

భీమవరం: మనిషి శరీరంలో చెవి, ముక్కు, గొంతు అతి సున్నితమైన భాగాలని వాటిని జాగ్రత్తగా సంరక్షించుకోవాలని ఈఎన్‌టీ వైద్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నడింపల్లి శంకర్‌కుమార్‌వర్మ అన్నారు. భీమవరం పట్టణంలోని రాధాకృష్ణ కన్వెన్షన్ హాల్లో మూడు రోజుల పాటు నిర్వహించే రాష్ట్ర స్థాయి చెవి ముక్కు గొంతు వైద్యుల 42వ వార్షిక సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ముందుగా భీమవరం విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ కేవీ విష్ణురాజు, సంఘ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. శంకర్‌కుమార్ వర్మ మాట్లాడుతూ వైద్యానికి నేడు ఎన్నో ఆధునిక పద్ధతులు అందుబాటులోనికి వచ్చాయని మెరుగైన వైద్యాన్ని అందించడానికి వైద్యులకు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. వర్షాకాలంలో ప్రత్యేకంగా చెవి, ముక్కు, గొంతుకు సమస్యలు వస్తుంటాయని శంకర్‌కుమార్‌వర్మ చెప్పారు. అనంతరం జైపూర్, ముంబయి, కోల్‌కతా ప్రాంతాలకు చెందిన పలువురు వైద్యులు సర్జరీ మెళకువలు లైవ్ ద్వారా వివరించారు. పీజీ విద్యార్థులకు పోస్టర్, పేపర్ ప్రెజెంటేషన్ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎంవీ సత్యనారాయణరాజును సత్కరించారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ గొట్టుముక్కల బాలకృష్ణంరాజు, ట్రెజరర్ ఎం.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### పరిశ్రమల ప్రోత్సాహానికి రాయితీలు

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో పరిశ్రమల ప్రోత్సాహానికి వివిధ రాయితీల కింద రూ.3.07 కోట్లు మంజూరు చేశామని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో జిల్లా ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పరిశ్రమలను ప్రోత్సహించే దిశగా రూ.3.07 కోట్లు 34 యూనిట్లకు వివిధ రాయితీల కింద మంజూరు చేశామన్నారు. దీనిలో బడుగు వికాసం పథకం ఎస్సీ కేటగిరిలో 28 యూనిట్లకు రూ.2.78 కోట్లు, జనరల్ కేటగిరి కింద ఐదు యూనిట్లకు రూ.28.08 లక్షలు, బీసీ కేటగిరీకి ఒక యూనిట్‌కు రూ.25 వేలు పెట్టుబడి రాయితీ, వడ్డీ రాయితీ, విద్యుత్ రాయితీలు మంజూరు చేశామన్నారు. సింగిల్ విండో పథకంలో అనుమతులను కాలయాపన లేకుండా మంజూరు చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ్ భాస్కర్ రావు, పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతి రావు తదితరులు పాల్గొన్నారు.

### ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ రిలీవ్



ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న అధ్యాపక సిబ్బంది

నూజివీడు: నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య ఎం.చంద్రశేఖర్ శుక్రవారం తన బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు. ఈ నెల 14 నుంచి నవంబరు 14 వరకు లాంగ్ లీవు పెట్టిన నేపథ్యంలో రిలీవ్ కాగా, ట్రిపుల్ ఐటీ బోధనా సిబ్బంది డైరెక్టర్ ఆచార్య చంద్రశేఖర్‌ను ఘనంగా సత్కరించారు. ఇన్‌చార్జి డైరెక్టర్‌గా ఏఓ బీ లక్ష్మణరావు ఈ నెల 16 వరకు వ్యవహరించనున్నారు. ఈ నెల 17 నుంచి ఇన్‌చార్జి డైరెక్టర్‌గా ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ బాధ్యతలు చేపట్టనున్నారు.

# ఉప్పుటేరు.. రైతుకు కన్నీరు

- ఏలూరు పర్యటనలో ఉప్పుటేరు అభివృద్ధి ఊసెత్తని చంద్రబాబు
- కొల్లేరుకు ప్రధాన డ్రెయిన్‌గా ఉప్పుటేరు
- నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఆక్రమణలు, పూడిక
- 62 కిలోమీటర్ల పరిధిలో 80 వేల ఎకరాల్లో ఆక్వా సాగు
- ఏటా వేధిస్తున్న ముంపు బెడద
- దివంగత వైఎస్ హయాంలో డ్రెడ్జింగ్ పనులకు శ్రీకారం
- మూడుచోట్ల రెగ్యులేటర్ల నిర్మాణానికి జగన్ సర్కారు రూ. 412 కోట్ల కేటాయింపులు



ఉప్పుటేరు ముంపునకు గురైన ఆకివీడులోని పంట పొలాలు

సాక్షి, భీమవరం: కొల్లేరుకు ప్రధాన డ్రెయిన్‌గా ఉన్న ఉప్పుటేరు ఆక్రమణలు, పూడికతో కుచించుకుపోతోంది. ముంపు నీటి సామర్థ్యం నానాటికి తగ్గిపోతోంది. వర్షాలు, వరదల సమయంలో పరీవాహక ప్రాంతాలను ముంచెత్తడం పరిపాటిగా మారింది. కొల్లేరు ముంపు ప్రాంతాలను పరిశీలించేందుకు ఏలూరు వచ్చిన సీఎం చంద్రబాబు ఉప్పుటేరు అభివృద్ధి ఊసెత్తకపోవడం స్థానికుల ఆశలపై నీళ్లు చల్లినట్లైంది. ఉమ్మడి పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల మధ్య ఉప్పుటేరు మేజర్ డ్రెయిన్‌గా ఉంది. కొల్లేరు నుంచి ఆకివీడు, కాళ్ల, భీమవరం మండలాల మీదుగా కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలంలోని గొల్లపాలెం వద్ద సముద్రంలో కలుస్తుంది. కొల్లేరుతో పాటు రెండు జిల్లాల పరిధిలోని మొగదిండి, న్యూ యనమదుర్రు, బొండాడ, పాలిమేర తిప్ప, పాత యనమదుర్రు తదితర 120 వరకు మేజర్, మైనర్ డ్రెయిన్లు, పంట కాలువలు ఉప్పుటేరులోనే కలుస్తుంటాయి. వీటి ద్వారా భారీగా గుర్రపుడెక్క, తూడు, వ్యర్థాలు ఉప్పుటేరులోకి చేరి పూడికతో నిండిపోతున్నాయి. మరోపక్క ఈ డ్రెయిన్‌ను ఆనుకుని ఉన్న ఆకివీడు, లోసరి, దొంగపిండి, పాతపాడు, మాలవానితిప్ప, మోడీ తదితర గ్రామాల్లో చాలాచోట్ల డ్రెయిన్ పూడుకుపోయి మేటలు వేసింది. ఆక్వా మాఫియా రాత్రికి రాత్రి అక్రమ తవ్వకాలు చేయడం ద్వారా రొయ్యలు, చేపలు చెరువులుగా మార్చేస్తుండటంతో డ్రెయిన్ కుచించుకుపోయింది. కొల్లేరు నుంచి గొల్లపాలెం వరకు 62 కిలోమీటర్లు మేర 80 వేలకు పైగా ఎకరాల్లో ఆక్వా చెరువులు సాగవుతుండగా అధిక సంఖ్యలో ఆక్రమణ చెరువులు ఉన్నట్టు అంచనా.

**పూడిక పేరుకుపోయి అడ్డంకులు**

ఆకివీడు వద్ద ఉప్పుటేరుపై కొత్త రైల్వే వంతెన నిర్మించారు. కలిదిండి మండలంలోకి వెళ్లేలా ఏలూరుపాడు వద్ద ఆర్‌అండ్‌బీ వంతెన ఉండగా డబుల్ లైన్ పనుల్లో రెండో రైలు వంతెన నిర్మించారు. ఆయా వంతెనల వద్ద పాత ఖానాలు తొలగించకపోవడం, కొత్త వంతెన నిర్మాణంలో బండ్‌లు ఏర్పాటు చేయడం, నిర్మాణం సమయంలో ఉపయోగించిన వ్యర్థాలు, మట్టిని వదిలివేయడంతో పూడిక పేరుకుపోయి నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోంది. ఆక్రమణలు, పూడికలతో ఉప్పుటేరు సామర్థ్యం నానాటికి తగ్గిపోతోంది. మూడు మీటర్లకు పైగా లోతు ఉండాల్సిన డ్రెయిన్ కొన్నిచోట్ల మీటరు లోతు మాత్రమే ఉంది. గతంలో 25 వేల క్యూసెక్కుల సామర్థ్యం కాగా ప్రస్తుతం 12 వేల క్యూసెక్కులకు తగ్గిపోయింది.

**వైఎస్సార్ హయాంలో..**

కొల్లేరు సరస్సు ప్రక్షాళన సమయంలో ఉప్పుటేరు ప్రక్షాళన చేయాలన్న రైతుల కోరిక మేరకు దివంగత వైఎస్సార్ హయాంలో పూడిక తొలగింపుకోసం ఆకివీడు వద్ద డ్రెడ్జింగ్ పనులు చేపట్టారు. జువ్వకనుమ నుంచి ఆర్‌అండ్‌బీ వంతెన సమీపం వరకు కొంత మేర పనులు పూర్తిచేశారు. వాతావరణం అనుకూలించక అప్పట్లో పనుల్ని వాయిదా వేశారు. ఉప్పుటేరు మెయింటెనెన్స్ కోసం ఒక డీఈ, ఐదుగురు ఏఈలు, 25 మంది సిబ్బంది ఉండేవారు. గుర్రపుడెక్క, తూడు తొలగించి ఆక్రమణలకు గురికాకుండా పర్యవేక్షించేవారు. రాను రాను సిబ్బంది పదవీ విరమణ, బదిలీలతో ప్రస్తుతం నలుగురు ఏఈలు, ఇన్‌చార్జి డీఈతో పాటు ఐదారుగురు సిబ్బంది మాత్రమే ఉండటంతో పర్యవేక్షణ కొరవడింది.

### జగన్ సర్కార్‌లో రూ.412 కోట్ల కేటాయింపులు

స్వచ్ఛ కొల్లేరు దిశగా గత వైఎస్‌ఆర్ ప్రభుత్వం అడుగులు వేసింది. అందులో భాగంగా ఆకివీడు మండలం దుంపగడప, మొగల్తూరు మండలం పడతడిక, మొల్లపర్రు వద్ద మూడు రెగ్యులేటర్ల నిర్మాణానికి నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.412 కోట్ల కేటాయింపులు చేశారు.

### ఏటా తప్పని ముంపు



పూడికతో నిండిపోయిన ఉప్పుటేరు

ఏటా అధిక వర్షాలు, వరదల సమయంలో ఉప్పుటేరు తన ఉగ్రరూపాన్ని దాల్చుతుంది. కొల్లేరు వరద నీరు సముద్రం చేరేందుకు ఉప్పుటేరు ద్వారా ప్రవహించాలి. మరోపక్క ఇతర కాలువల నీటితో ప్రవాహ వేగం అధికంగా ఉంటుంది. పరీవాహక గ్రామాలు, చెరువులు, పంటపొలాలు ముంపు బారిన పడి అపారనష్టం వాటిల్లుతోంది. విపత్తుల సమయంలోనే అధికారులకు ఉప్పుటేరు గుర్తొస్తుంది. ఆ సమయంలోనే తాత్కాలిక ఏర్పాట్లు చేసి చేతులు దులుపుకోవడం మినహా శాశ్వత పరిష్కారం చూపడం లేదు.

### ఉప్పుటేరు ఊసెత్తని చంద్రబాబు

ఉప్పుటేరు ప్రక్షాళన దిశగా కూటమి ప్రభుత్వం చొరవ చూపకపోవడం విమర్శలకు తావిస్తోంది. కొల్లేరు ముంపు ప్రాంతాలను పరిశీలించేందుకు రెండు రోజుల క్రితం ఏలూరు వచ్చిన సీఎం చంద్రబాబు ఉప్పుటేరు అభివృద్ధికి చర్యలు చేపడతారని అంతా భావించారు. ఆ ప్రస్తావనే రాకపోవడం స్థానికులను తీవ్ర నిరుత్సాహానికి గురిచేస్తోంది. విపత్తులు సంభవించినప్పుడు హడావిడి మినహా శాశ్వత పరిష్కారం దిశగా చొరవ చూపడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలోను ఉప్పుటేరు అభివృద్ధికి ఆయన చేసిందేమీ లేదంటున్నారు.

### పూడిక తొలగించాలి



కొల్లేరు–ఉప్పుటేరు మొగ మధ్య పూడిక భారీగా పెరిగిపోవడం వల్ల ఏటా పరివాహక ప్రాంతాలను ముంపు బెడద వేధిస్తోంది. ఉప్పుటేరు సామర్థ్యం దశాబ్దాలుగా కుచించుకుపోయింది. 62 కిలోమీటర్లు పొడవు కలిగిన ఉప్పుటేరు చాలాచోట్ల పూడికతో నిండి లోతు తగ్గిపోయింది.

– మోటుపల్లి గంగాధరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్, ఆకివీడు

### ఉప్పుటేరు ప్రక్షాళన చేయాలి



కొల్లేరు, ఉప్పుటేరు ముంపు నివారణకు ఉప్పుటేరు ప్రక్షాళన అత్యవసరం. దివంగత వైఎస్ హయాంలో కొంతమేర డ్రెడ్జింగ్ చేశారు. వైఎస్‌ఆర్ ప్రభుత్వంలో రెగ్యులేటర్ల నిర్మాణానికి నిధులు కేటాయింపులు జరిగాయి. ఒకటో మైలు రాయి నుంచి సీ మౌత్ వరకు పూడిక తీసి ఆక్రమణలు తొలగించాలి. నీటి ప్రవాహ వేగాన్ని పెంచేందుకు కృషిచేయాలి.

– పీవీఎల్ నరసింహరాజు, వైఎస్సార్‌సీపీ కన్వీనర్, ఉండి నియోజకవర్గం

### రైతుల రుణాలు రీ షెడ్యూల్ చేయాలి



కలెక్టర్ నాగరాణికి వినతిపత్రం అందజేస్తున్న కిసాన్ మోర్చా నాయకులు

భీమవరం: భారీ వర్షాలు, వరదలు కారణంగా పంటలు దెబ్బతిన్న రైతుల రుణాలు రీషెడ్యూల్ చేసి తక్షణమే ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా ఇవ్వాలని బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో కలెక్టర్ సీహెచ్ నాగరాణికి శుక్రవారం వినతిపత్రం అందచేశారు. అనంతరం కలెక్టరేట్ వద్ద కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు తోట గంగరాజు మాట్లాడుతూ ఒక పక్క పంట, మురుగు కాలువలు తవ్వని కారణంగా మురుగుకాలువల్లో గుర్రపు డెక్క, తూడు, కిక్కిస తొలగించకపోవడంతో వర్షాలకు వరిపైరు నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు దాసరి బాబి మాట్లాడుతూ జిల్లాలో కొన్నిచోట్ల రెండుసార్లు వరినాట్లువేసినప్పటికీ వర్షాలు, వరదలు కారణంగా పైరు నీటమునిగి రైతులు పూర్తి స్థాయిలో నష్టపోయి సంక్షోభంలో కూరుకుపోయారన్నారు.

# కొల్లేరు చేపలు సముద్రం పాలు

- 7 వేల ఎకరాల అనధికారిక చెరువులకు నష్టం
- నష్టం విలువ రూ.100 కోట్ల పైమాటే
- ఏలూరు రూరల్, కైకలూరు మండలాల్లో అధికంగా నష్టం
- పెదపాడు, మండవల్లిలోనూ నీటమునిగిన చెరువులు



ఏలూరు రూరల్ మండలం కోమటిలంకలో చేపల చెరువు మీదుగా ప్రవహిస్తున్న కొల్లేరు నీరు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: కొల్లేరులో అక్రమ చెరువులకు వరదలు గండికొట్టాయి. 18 ఏళ్ల క్రితం వరదలకు కొల్లేరు చెరువులకు భారీ నష్టం వాటిల్లగా.. మళ్లీ అదే తరహాలో వరదలు కొల్లేరుకు పోటెత్తడంతో అనధికారిక చెరువులు మొత్తం కొల్లేరు పాలయ్యాయి. కొల్లేరు అభయారణ్యంలో ఉన్న అనధికారిక చెరువుల్లో 7 వేల ఎకరాలకు పైగా నీటమునిగాయి. రూ.100 కోట్ల మేర నష్టం వాటిల్లింది. ఇక అధికారికంగా పెదపాడు, మండవల్లి, గణపవరం, నిడమర్రు మండలాల్లో 255 ఎకరాలు నీటమునగడంతో రూ.2 కోట్ల నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమిక అంచనాలు సిద్ధం చేశారు.

**2.23 లక్షల ఎకరాల్లో కొల్లేరు సరస్సు :** కొల్లేరు అభయారణ్యం అక్రమ చెరువుల సాగుకు కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయింది. కొల్లేరు చేపలకు జాతీయ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న క్రమంలో విచ్చలవిడిగా అక్రమ సాగు జరుగుతుంది. 2.23 లక్షల ఎకరాల్లో కొల్లేరు సరస్సు ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని 10 కాంటూరులో విస్తరించి ఉంది. ఆసియాలోనే అతి పెద్ద మంచినీటి సరస్సుగా కొల్లేరు ఖ్యాతిగడించింది. 5వ కాంటూరు వరకు 77,138 ఎకరాలు ఉంది. ఈ క్రమంలో కొల్లేరును అక్రమ చేపల సాగుకు చిరునామాగా మార్చేశారు.

**80 శాతానికి పైగా అక్రమ చెరువులు**

77 వేల ఎకరాల అభయారణ్యంలో 65 వేల ఎకరాలు, 5 నుంచి 10వ కాంటూరు మధ్య 48 వేల ఎకరాలు మొత్తంగా సుమారు 1.13 లక్షల ఎకరాలు అక్రమణలో ఉంది. దీనిలో 80 శాతానికిపైగా అక్రమ చెరువులు సాగులో ఉన్నాయి. 2006లో కొల్లేరు ఆపరేషన్ నిర్వహించి సుప్రీంకోర్టు ఆదేశాలతో 25,142 ఎకరాల విస్తీర్ణంలో చెరువులను ధ్వంసం చేశారు. కాలక్రమేణా ధ్వంసం చేసిన చెరువులన్నీ యథాస్థితికి చేరుకున్నాయి. తాజాగా తమ్మిలేరు, ఉప్పుటేరు నుంచి భారీగా వరద నీరు కొల్లేరుకు చేరింది. 18 ఏళ్ల తర్వాత భారీ వరద రావడంతో ఏలూరు రూరల్ మండలం, కైకలూరు, మండవల్లి మండలాల్లో వేల ఎకరాల్లో పంట పొలాలు, ఏలూరు రూరల్ మండలం, కై కలూరు పరిధిలో ఉన్న అభయారణ్యంలో ఉన్న 7 వేల ఎకరాల్లో చేపల చెరువులు పూర్తిగా నీటమునిగాయి. వరద నీటి ఉధృతి కొనసాగి ఉప్పుటేరు మీదుగా సముద్రంలోకి చేరుతున్న క్రమంలో మత్స్యసంపద కొట్టుకుపోతుంది. కొంతమంది వలలు ఏర్పాటు చేసి కొంతమేరకు ఆపగలుగుతున్నా వరద తీవ్రతతో చేపలు కొట్టుకుపోతున్నాయి.

### నష్టపోయిన రైతులను ఆదుకుంటాం



కాళ్లలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

కాళ్ల: భారీ వర్షాల కారణంగా నష్టపోయిన ప్రతి వరి రైతు పేరు నష్టపరిహార జాబితాలో ఉండాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. మండల కేంద్రమైన కాళ్లలో ఇటీవల భారీ వర్షాలకు నీట మునిగి పాడైపోయిన వరి పొలాలను శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. క్షేత్రస్థాయిలో పొలాల గట్లు పైకి వెళ్లి కుళ్ళిన వరి దుబ్బలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుందని ఎవరూ అధైర్య పడవద్దని భరోసా కల్పించారు. అనంతరం మండలంలో ఎన్ని ఎకరాల్లో పంట నష్టం జరిగిందో వ్యవసాయ అధికారులనడిగి తెలుసుకున్నారు. నష్టపోయిన ఏ ఒక్క రైతు పేరు జాబితాలో లేకున్నా, అర్హత లేని రైతు పేరు జాబితాలో ఉన్నా కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఆమె వెంట జిల్లా వ్యవసాయ అధికారి జెడ్. వెంకటేశ్వరరావు, ఆకివీడు ఏడీఏ శ్రీనివాసరావు, వ్యవసాయ అధికారి జయ వాసుకి, ఆర్‌ఐ లక్ష్మీ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

### పారదర్శకంగా పంట నష్టం జాబితా



ఏలూరుపాడులో రైతుల జాబితా పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వరరావు

కాళ్ల: భారీ వర్షాల కారణంగా నీట మునిగి పంట నష్టపోయిన జాబితాలో ఎలాంటి తప్పులు దొర్లకుండా పారదర్శకంగా నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు అధికారులకు సూచించారు. కాళ్ల మండలం ఏలూరుపాడులో ఇటీవల భారీ వర్షాలకు మునిగిన వరిచేలను స్థానిక వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. నష్ట జాబితాను పరిశీలించి నష్టపోయిన కౌలు రైతులను జాబితాలో తప్పనిసరిగా పొందుపరచాలని సూచించారు. మండలంలో మొత్తం 785 ఎకరాల్లో వరి పంట నష్టం జరిగినట్లు అధికారులు తెలిపారు. వీరిని ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆకివీడు వ్యవసాయ సహాయ సంచాలకుడు కె.ఎస్.ఎస్. శ్రీనివాసరావు, ఏవో సి.జయవాసుకి, వీఆర్వోలు సుబ్రహ్మణ్యం, మణికుమార్, వి.ఏ.ఏ, రైతులు పాల్గొన్నారు.

# వరద తగ్గినా.. వీడని ముంపు

యలమంచిలి: గోదావరిలో వరద తీవ్రత తగ్గుముఖం పట్టింది. దీంతో లంక గ్రామాల ప్రజలు, అధికారులు ఊపిరి పీల్చుకుంటున్నారు. అయితే కనకాయలంకలో కాజ్ వేతోపాటు పల్లపు ప్రాంతాల్లోని ఇళ్లు, పెదలంక గ్రామంలోని దీపాటి వారి గ్రూపు, సిర్రా వారి గ్రూపు, దొడ్డిపట్ల, లక్ష్మీపాలెం గ్రామాలలో మత్స్యకార కాలనీ, యలమంచిలిలంక, బాడవ గ్రామాలలో ప్రధాన రహదారులు ఇంకా వరద నీటిలోనే ఉన్నాయి. దీంతో ప్రజలు వరదతో సహజీవనం చేస్తున్నారు. గత మూడు రోజులుగా కనకాయలంక ప్రజలు వరదతో కొట్టుమిట్టాడుతున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందకపోవడంపై గ్రామస్తులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు కాజ్ వే వద్దకు వచ్చి వెళ్లిపోతున్నారే కానీ గ్రామంలోకి వచ్చి ప్రజల కష్టాన్ని పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. వ్యవసాయ కూలీ కుటుంబాల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

**కొనసాగుతున్న వశిష్ట ఉధృతి**

నరసాపురం: నరసాపురం వశిష్ట గోదావరి ఉధృతి శుక్రవారం కూడా తగ్గలేదు. ఎగువ ప్రాంతం నుంచి భారీగా గోదావరిలోకి నీరు వచ్చి చేరుతుంది. సముద్రం పోటు సమయంలో మాత్రం నీటిమట్టం పెరుగుతోంది. గోదావరి ఉధృతి కారణంగా పట్టణంలోని మాధవాయిపాలెం రేవులో పంటు రాకపోకలు సాగడం లేదు. ఏటిగట్టును ఆనుకుని పొన్నపల్లి, మాధవాయిపాలెం ప్రాంతాల్లోని వారు ఆందోళన చెందుతున్నారు. స్లూయిజ్‌లు, డ్రెయిన్ల ద్వారా గోదావరి నీరు స్వల్పంగా కాలనీల్లోకి చేరుతుంది. మరో రెండు, మూడు రోజులు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉంది.



యలమంచిలి మండలం దొడ్డిపట్లలో నీట మునిగిన మత్స్యకార కాలనీ



యలమంచిలి మండలం లక్ష్మీపాలెంలో ముంపులో మత్స్యకార కాలనీ



నరసాపురంలో ఉధృతంగా వశిష్ట గోదావరి



యలమంచిలి మండలంలో బాడవ ప్రధాన రహదారి



సిద్ధాంతంలో తగ్గుముఖం పట్టిన గోదావరి

**గోదావరి తగ్గుముఖం**

పెనుగొండ: రెండు రోజుల పాటు ఉధృతంగా ప్రవహించిన వశిష్ట గోదావరి తగ్గుముఖం పట్టింది. శుక్రవారం ఉదయం నుంచి సిద్ధాంతం, పెదమల్లం, లంక గ్రామాల్లో వరద ఉధృతి తగ్గడంతో నీట మునిగిన పల్లపు ప్రాంతాలు బయటపడుతున్నాయి. పెదమల్లం మాచేనమ్మ ఆలయం చుట్టూ చేరిన గోదావరి వరద నీరు నెమ్మదిగా తగ్గుతుండడంతో బయట పడుతుంది. నీటి ప్రవాహం వేగంగా ఉండడంతో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

## క్లుప్తంగా

### మద్ది క్షేత్రంలో పవిత్రోత్సవాలు



పవిత్రోత్సవాల్లో మంత్రోచ్చరణ చేస్తున్న అర్చకులు, వేదపండితులు

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని గుర వాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో పవిత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. విష్వక్సేన పూజ, పుణ్యహవాచనం, అగ్ని ప్రతిష్ఠ, వాస్తు హోమం, సూత్ర గ్రహణం, గ్రంధి బంధనం, చతుర్వేదద్యాయనం, ద్వాదశ సూక్త పారాయణం, ఏతత్ ప్రధాన హోమాలు, నీరాజన మంత్రపుష్పాలు వంటి పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారి దర్శించుకుని పవిత్రోత్సవ పూజలను వీక్షించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి ఆకుల కొండలరావు పాల్గొన్నారు.

### నిట్‌లో స్వచ్ఛతా పక్వాడ



నిట్‌లో స్వచ్ఛతా పక్వాడలో విద్యార్థులు

తాడేపల్లిగూడెం : ఏపీ నిట్‌లో శుక్రవారం స్వచ్ఛతా పక్వాడ కార్యక్రమం ఫిజికల్ ఎడ్యుకేషన్ క్లబ్, ప్రయత్నం, టాస్క్‌ఫోర్స్ క్లబ్, బందావనం క్లబ్‌లు సంయుక్తంగా నిర్వహించాయి. ప్రాంగణంలోని అకడమిక్ భవనాలు, క్యాంటీన్, ఇండోర్ స్టేడియం, నిట్ ముఖద్వారం పరిసరాల్లోని ప్లాస్టిక్ వ్యర్థాలను, చెత్తాచెదారాన్ని విద్యార్థులు తొలగించి, శుభ్రం చేశారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సాస్ అసిస్టెంట్లు డాక్టర్ శ్రీనివాసు, సంధ్యారాణి, క్లబ్ కార్యదర్శులు బి.తరుణ్, జగదీష్, మల్లికార్జున్, ఎం సాయి శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### యువకుడు అదృశ్యం

తణుకు టౌన్ : తణుకు పట్టణం సజ్జాపురం ప్రాంతానికి చెందిన 21 ఏళ్ల యువకుడు అదృశ్యంపై కేసు నమోదు చేశామని ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. సజ్జాపురంలోని శివాలయం వీధికి చెందిన సన్నంశెట్టి దేవరాజు ఈనెల 6వ తేదీన ఇంటి నుంచి బయటకెళ్లి తిరిగి రాలేదని, గురువారం దేవరాజు తండ్రి కృష్ణబాలాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని తెలిపారు.

### విద్యుత్ ఏఈ, జేఎల్ఎం సస్పెన్షన్

జంగారెడ్డిగూడెం రూరల్: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటనపై నిర్లక్ష్యానికి కారణమైన విద్యుత్ శాఖ సిబ్బందిపై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ఈనెల 12న జంగారెడ్డిగూడెం మండలం నిమ్మలగూడెంలో రైతు కంకిపాటి నాగరాజు అనే రైతు విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన విషయం విదితమే. ఈ ఘటనలో లక్కవరం ఏఈ జోషఫ్, జేఎల్ఎం తామా వెంకటేశ్వరరావులను సస్పెండ్ చేశామని, షిఫ్టు ఆఫరేటర్ ఎస్ మణికుమార్‌ని విధుల నుంచి తొలగించారు. లైన్ ఇన్‌స్పెక్టర్ పీజేవీ గణేష్ సింగ్‌కి షోకాజ్ నోటీస్ ఇచ్చామని డీఈ రాధాకృష్ణ తెలిపారు.

# వర్జీనియా అ'ధర'హో

- రైతుల్లో ఆనందం
- కేజీ గరిష్ట ధర రూ.407
- గరిష్ట ధరలను తాకుతూ సాగుతున్న సీజన్



| వేలం కేంద్రం | వచ్చిన బేళ్లు | కొనుగోళ్లు | గరిష్ట ధర (రూ.) | సరాసరి ధర (రూ.) |
|---|---|---|---|---|
| దేవరపల్లి | 1123 | 494 | 370 | 325.69 |
| జంగారెడ్డిగూడెం–1 | 1106 | 706 | 406 | 333.72 |
| జంగారెడ్డిగూడెం–2 | 1511 | 1207 | 407 | 335.16 |
| కొయ్యలగూడెం | 947 | 523 | 404 | 336.48 |
| గోపాలపురం | 1133 | 702 | 400 | 334.89 |

జంగారెడ్డిగూడెం: వర్జీనియా ధర రికార్డులను సృష్టిస్తోంది. రూ.300 దాటితే బాగుంటుందని ఆశించిన రైతుకు అంతకుమించి అన్నట్టు ధర నూతన గరిష్టాలను తాకుతోంది. శుక్రవారం ఎస్ఎల్ఎస్ ఏరియా పరిధిలోని ఐదు వేలం కేంద్రాల్లో నాలుగు కేంద్రాల్లో రూ.400 మార్కును తాకింది. గరిష్టంగా జంగారెడ్డిగూడెం వేలం కేంద్రంలో కేజీకి రూ.407 గరిష్ట ధర నమోదైంది. ఈ సీజన్ కొనసాగుతున్న కొద్దీ గరిష్ట ధరలను తాకుతూ రైతులకు ఉత్సాహాన్నిస్తోంది. ఎస్ఎల్ఎస్ ఏరియా పరిధిలో పండిన పొగాకు నాణ్యతతో ఉండటంతో బయ్యర్లు ఉత్సాహంగా పొగాకును కొంటున్నారు. అంతర్జాతీయంగా సైతం మన పొగాకు డిమాండ్ పెరగడంతో ధర పెరుగుతూ పోతోంది.

**అంచనాలకు మించి**

వర్జీనియా పొగాకు ధరలు అంచనాలకు మించి నమోదవుతునే ఉన్నాయి. ఎవరూ ఊహించని విధంగా శుక్రవారం కేజీకి రూ.407 గరిష్ట రావడం ఆశ్చర్యానికి గురిచేసింది. ఎస్ఎల్ఎస్ ఏరియా పరిధిలోని ఐదు వేలం కేంద్రాల్లో కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం-1, -2, గోపాలపురం వేలం కేంద్రాల్లో రూ.400 మార్కును తాకింది.

**ధర ప్రస్థానం ఇలా..**

ఈ ఏడాది వర్జీనియా వేలం ప్రక్రియ మార్చి 6న ప్రారంభమైంది. తొలిరోజు ప్రారంభ ధర రూ.240 లభించింది. దీంతో రైతులు ఒకింత నిరాశ వ్యక్తం చేశారు. రూ.300 దాటితేనే తమకు పెట్టుబడులు వస్తాయని ఆశించారు. నెమ్మదిగా ధర పెరగడం మొదలు పెట్టింది. మార్చి 20న రూ.266, 25వ తేదీన రూ.303 లభించింది. గత ఏడాది గరిష్ట ధర రూ. 288ను కొద్ది రోజుల్లోనే తుడిచిపెట్టుకుపోయి నూతన గరిష్ట ధర నమోదైంది. ఆ తరువాత ధరల్లో స్వల్ప మార్పులు చోటు చేసుకున్నప్పటికీ నెమ్మదిగా తన గరిష్టాన్ని పెంచుకుంటూ జూన్ 25వ తేదీన రూ.350 మార్కును దాటింది. అనంతరం రూ.350 నుంచి రూ.400 మధ్య ఊగిసలాడుతూ ఉన్న ధర శుక్రవారం కేజీకి రూ.407 పలికింది.

**అంతర్జాతీయంగా డిమాండ్**

అంతర్జాతీయంగా పొగాకు ఉత్పత్తి తగ్గడంతో దేశీయ వర్జీనియా పొగాకుకు డిమాండ్ పెరిగింది. ప్రధాన ఉత్పత్తిదారులైన బ్రెజిల్, జింబాబ్వేలలో ఈ ఏడాది పంట దిగుబడి తగ్గింది. అంతర్జాతీయ అవసరాలకు అనుగుణంగా పంట దిగుబడి లేకపోవడంతో, మన పొగాకుకు ఆర్డర్లు పెరుగుతున్నాయి. దీనికితోడు రైతులు వర్జీనియా పొగాకు బోర్డు సూచనల మేరకు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగణంగా వర్జీనియా పంటను ఉత్పత్తి చేయడం, మన పొగాకు పరిమళం బాగుండటంతో ఎగుమతుల ఆర్డర్లు కూడా ఎక్కువ వస్తున్నాయి. దీంతో కంపెనీలు పోటీపడి కొనుగోలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో నూతన ధరలు లభిస్తున్నాయి.

**ఐదు వేలం కేంద్రాల్లో ధర ఇలా..**

ఎస్ఎల్ఎస్ ఏరియాలోని దేవరపల్లిలో గరిష్ట ధర రూ.370 పలికింది. జంగారెడ్డిగూడెం-1లో రూ.406, జంగారెడ్డిగూడెం-2 రూ.407, కొయ్యలగూడెంలో రూ.404, గోపాలపురంలో రూ.400 గరిష్ట ధరలు నమోదయ్యాయి.

### ముగిసిన విలువ ఆధారిత ఉత్పత్తుల శిక్షణ



అరటి శిక్షణ కార్యక్రమంలో వీసీ గోపాల్

తాడేపల్లిగూడెం: వెంకట్రామన్నగూడెంలోని కేవీకేలో అరటితో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీలో ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. అతిథిగా పాల్గొన్న డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యానవర్సిటీ వీసీ కె.గోపాల్ మాట్లాడుతూ నేర్చుకున్న అంశాలను ఒక ప్రాజెక్టు రిపోర్టుగా రూపొందించి, నాబార్డు నేషనల్ హార్టీకల్చర్ మిషన్‌కు, రాష్ట్ర ఉద్యాన విభాగానికి ఇచ్చి, అరటి ఆధారిత ఉత్పత్తుల తయారీని ఒక పరిశ్రమగా ప్రారంభించవచ్చని తెలిపారు. శిక్షణ కాలంలో నేర్చుకున్న విషయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అరటినారతో మహిళలు గాజులు, చెవిరింగులు, బ్రాస్‌లెట్లు, నారతీయడం వంటి విలువ ఆధారిత ఉత్పత్తులను తయారుచేశారు. ముగింపు కార్యక్రమంలో కేవీకే సమన్వయకర్త ఇ.కరుణశ్రీ, విస్తరణ సంచాలకులు బి.గోవిందరాజులు, రిజిస్ట్రార్ బి.శ్రీనివాసు, అధికారులు జి.రామానందం, కె.ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

# బాలికల జిల్లా జట్ల ఎంపిక



బాస్కెట్‌బాల్ ఎంపికలో ప్రావీణ్యం ప్రదర్శిస్తున్న బాలికలు



కబడ్డీ పోటీల్లో ప్రత్యర్థి జట్టు క్రీడాకారిణిని టాకిల్ చేస్తున్న మరో జట్టు క్రీడాకారిణిలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో త్వరలో నిర్వహించే రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల నిమిత్తం శుక్రవారం స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా జూనియర్ కళాశాలలో అండర్–19 విభాగంలో నాలుగు క్రీడాంశాలకు బాలికల జట్ల ఎంపికలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన కబడ్డీ, బాస్కెట్‌బాల్, హ్యాండ్ బాల్, బాల్ బ్యాడ్మింటన్ జట్లను ఎంపిక చేశారు. ఈ పోటీలకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని వివిధ కళాశాలల నుంచి 250 మంది విద్యార్థినులు హాజరయ్యారు. ఆయా అంశాల్లో ఎంతో ఉత్సాహంగా నువ్వానేనా అన్నట్టు బాలికలు పోటీ పడ్డారు. మంచి ప్రావీణ్యం ప్రదర్శించిన విద్యార్థినులను జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. కబడ్డీ, బాస్కెట్ బాల్ జట్లకు 12 మంది చొప్పున ప్రధాన జట్టుకు ఎంపిక చేశారు. హ్యాండ్‌బాల్ జట్టుకు 16 మందిని, బాల్ బ్యాడ్మింటన్ జట్టుకు 10 మందిని ఎంపిక చేయగా, వారితో పాటు ప్రతి జట్టుకూ మరో నలుగురు చొప్పున స్టాండ్‌బై క్రీడాకారిణులను ఎంపిక చేశారు. సెయింట్ థెరిస్సా మహిళా జూనియర్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఐ.ఆండాళ్లు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎంపికలను స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–19 జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.జయరాజు పర్యవేక్షించారు. ఆయా జట్లకు ఎంపికైన బాలికలను సెయింట్ థెరిస్సా కళాశాల ప్రిన్సిపాల్ పి.మెర్సీ, వైస్ ప్రిన్సిపాల్ ఫాతిమా డిగల్ ప్రత్యేకంగా అభినందించారు. పోటీల నిర్వహించడంలో సహకరించిన పీడీలు, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి జయరాజు ధన్యవాదాలు తెలిపారు.

## వరద బాధితులకు 'ఎస్ఆర్‌కేఆర్' విరాళం



సీఎం చంద్రబాబుకి రూ.25 లక్షల విరాళం అందిస్తున్న ఎస్ఆర్‌కేఆర్ అధ్యక్షుడు ప్రసాదరాజు

భీమవరం: విజయవాడలో వరద బాధితుల కోసం భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం, సిబ్బంది తరఫున కళాశాల అధ్యక్షుడు సాగి ప్రసాద్‌రాజు, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిషాంత్ వర్మ, కళాశాల గవర్నింగ్ బాడీ మెంబర్ సాగి సత్య ప్రతీకవర్మ శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి రూ.25 లక్షల చెక్కును అందించారు. కళాశాల యాజమాన్యం, సిబ్బంది కలిసి ఈ నగదు అందించామని, ఇప్పటికే తమ కళాశాల నుంచి 10 వేల ఆహార పొట్లాలను విజయవాడ పంపించామని ప్రసాద్‌రాజు, నిషాంతవర్మ తెలిపారు.

# 'వరద' వసూళ్లు..!

- పెద్ద రైతులు, రైతు సంఘాలే లక్ష్యం
- టీడీపీ, జనసేన నాయకుల నేతృత్వంలోనే..
- జిల్లా నుంచి రూ.5 కోట్ల వసూలుకు ప్రణాళిక?



కాళ్ల ప్రాంతంలో నీట మునిగిన సార్వా వరి పొలాలు

భీమవరం: చంద్రబాబు ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ఓ వైపు విజయవాడలో ముంపుబారిన పడి లక్షలాదిమంది నానా ఇబ్బందులు పడుతుంటే.. మరోవైపు వరదలను అడ్డుపెట్టుకుని విరాళాల పేరుతో భారీగా వసూళ్లు చేయడానికి కొంతమంది రంగంలోకి దిగారు. దీనికి టీడీపీ, జనసేన నాయకులు జట్టు కట్టినట్టు ప్రచారం జరుగుతోంది. పశ్చిమ గోదావరి జిల్లావ్యాప్తంగా రూ.5 కోట్ల వసూళ్ల చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్టు చెబుతున్నారు.

**రైతులు, రైతు సంఘాల నుంచే..**

రాజధాని ప్రాంత రైతులను ఆదుకోవడానికంటూ జిల్లాలో కొంతమంది విరాళాల సేకరణకు ప్రణాళిక సిద్ధం చేశారు. దీనికిగానూ పెద్ద రైతులు, రొయ్యల రైతులు, కొలగారాల (రైతు సంఘాలు) లక్ష్యంగా చేసుకున్నట్లు తెలిసింది. గ్రామాల్లో రైతుల సమస్యల పరిష్కారానికి కొలగారాలను ఏర్పాటు చేసుకుని దానికి కొంత నిధిని సమకూర్చుకుంటారు. ప్రధానంగా రైతులు పండించిన ధాన్యం, ఇతర పంటల తూకం వేయడానికి గానూ రైతుల నుంచి ఎకరాకు కొంత మొత్తంలో వసూళ్లు చేస్తుంటారు. ప్రతి ఏటా ఈ విధంగా వసూలు చేసిన మొత్తం కొలగారం పెద్దలు కాలువల్లో పూడిక తీయించడానికి, బోదులు తవ్వించడం వంటి పనులకు వినియోగిస్తారు. ప్రస్తుతం కొలగారం సొమ్ములో కొంత మొత్తాన్ని వరద ప్రభావిత ప్రాంత రైతులకు విరాళంగా ఇవ్వాలని ఆయా సంఘాల నేతలకు టీడీపీ, జనసేన నేతలు వర్తమానం పంపుతున్నారు. ఇదిలా ఉండగా.. పశ్చిమగోదావరి జిల్లాలో జూన్‌లో కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా సుమారు 13 వేల ఎకరాల్లో వరి పైరు పూర్తిగా దెబ్బతింది. ఇటీవల కురిసిన వర్షాలకు మరోసారి దాదాపు 13,590 ఎకరాల్లో పైరు నీట మునిగినట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. వర్షాలు, వరదల కారణంగా రెండు, మూడు పర్యాయాలు, నారుమళ్లు, నాట్లు వేసి ఆర్థిక ఇబ్బందులతో రైతులు సతమతమవుతుంటే ఆదుకోవాల్సింది పోయి.. ఎక్కడో దెబ్బతిన్న ప్రాంతాలకు సహాయమంటూ విరాళాలు వసూలు చేయడమేమిటంటూ జిల్లా రైతులు మండిపడుతున్నారు.

# పశు ఆహారంలో ఖనిజ మిశ్రమాలు తప్పనిసరి

- ఉత్పాదకత, ప్రజనన సామర్థ్యం మెరుగు
- పాడి రైతులకు వరం

పాడి-పంట



పాడి పశువులు



ఖనిజ మిశ్రమాల ప్యాకెట్లు



డాక్టర్ బీ.ఆర్. శ్రీనివాసన్, పశు వైద్య అధికారి

జంగారెడ్డిగూడెం : పాడి పశువుల ఆరోగ్యం, ఉత్పాదకత, ప్రజనన సామర్థ్యానికి ఖనిజ మిశ్రమాలు కీలక పాత్రను పోషిస్తాయి. వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయి, పాల ఉత్పత్తిని మెరుగుపరుస్తాయి. ఖనిజ మిశ్రమాలను పశువులకు ఇచ్చే ఆహారంలో ఉండేలా చూసుకోవాలి. పాడి పశువులలో ఖనిజ మిశ్రమాల ఉపయోగాల గురించి పశు వైద్యాధికారి బీఆర్ శ్రీనివాసన్ మాటల్లో.. ఆంధ్రప్రదేశ్‌లో ఖనిజ మిశ్రమాలు 100 శాతం అవసరం. ఇవి పశువుల పోషణలో ఉన్న లోపాలను పూరిస్తాయి. పాల ఉత్పత్తిని పెంచుతాయి.

**నాలుగు రకాలు**

- ఖనిజ మిశ్రమాలను నాలుగు రకాలుగా వర్గీకరించవచ్చు. సాధారణ, ఈస్ట్ కల్చర్‌తో కూడిన, కీలేటెడ్, మూలికలతో కూడిన ఖనిజ మిశ్రమాలు. వీటిలో ఉన్న ఖనిజ మిశ్రమాలు ఆధారంగా పశువుల్లో వివిధ రకాల సామర్థ్యాలు మెరుగవుతాయి.
- సాధారణ ఖనిజ మిశ్రమాల్లో ప్రధాన ఖనిజాలైన కాల్షియం, ఫాస్పరస్, మెగ్నీషియం, సోడియంతో పాటు సూక్ష్మ ఖనిజాలైన జింక్, కాపర్, మాంగనీస్, కోబాల్ట్, అయోడిన్, సెలీనియం వంటివి ఉంటాయి. ఈ మిశ్రమాన్ని రోజుకు 50 నుంచి 100 గ్రాములు పెద్ద పశువులకు అందించాలి.
- ఈస్ట్ కల్చర్‌తో కూడిన ఖనిజ మిశ్రమాన్ని పశువులకు అందించడం ద్వారా మెరుగైన జీర్ణ క్రియ, ఎక్కువ పాల ఉత్పత్తిని సాధించవచ్చు. రోజుకు 60 నుంచి 120 గ్రాములు పెద్ద పశువులకు అందించాల్సి ఉంటుంది.
- కీలేటెడ్ ఖనిజ మిశ్రమాన్ని వినియోగించడం ద్వారా పశువులకు మెరుగైన శోషణ, తక్కువ మోతాదుతో ఎక్కువ ప్రభావం కలుగుతుంది. రోజుకు 40 నుంచి 80 గ్రాములు పెద్ద పశువులకు అందించాలి.
- మూలికలతో కూడిన ఖనిజ మిశ్రమాన్ని పశువులకు అందించడం ద్వారా పాల ఉత్పత్తి పెరుగుదలతో పాటు మెరుగైన ఆరోగ్యం పశువులకు లభిస్తుంది. ఈ మిశ్రమాన్ని ఉత్పత్తిదారు సూచనల ప్రకారం పశువులకు అందించాల్సి ఉంటుంది.

**పాల ఉత్పత్తి, న్యాణ్యత మెరుగు**

0 నుంచి 6 నెలల వయసు ఉన్న దూడలకు రోజుకు 20 నుంచి 30 గ్రామల మిశ్రమాన్ని అందించాలి. ఖనిజ మిశ్రమాలు అందించడం ద్వారా దూడల ఎముకల పెరుగుదల, రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. 6 నుంచి 24 నెలల వయసు ఉన్న పెంపకం ఆవులకు రోజుకు 40 నుంచి 60 గ్రాముల మిశ్రమాన్ని అందిస్తే శరీర పెరుగుదలతో పాటు వాటి ప్రజనన వ్యవస్థ అభివృద్ధి చెందుతుంది. గర్భందాల్చిన పశువులకై తే రోజుకు 80 నుంచి 100 గ్రాములు అందించాలి. దీని వల్ల చూడి పశువుల గర్భంలోని పిండం అభివృద్ధితో పాటు చూడి పశువు ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడుతుంది. పాలిచ్చే పశువులకైతే రోజుకు 100 నుంచి 120 గ్రాములు అందించాల్సి ఉంటుంది. ఇలా మిశ్రమాన్ని అందించడం ద్వారా ఆయా పశువుల్లో పాల ఉత్పత్తి, పాల నాణ్యత మెరుగుపడుతుంది.

**ఖనిజ మిశ్రమాలు పశువుకు అందించే విధానం**

- రోజూ తగిన మోతాదులో ఇవ్వడం చాలా ముఖ్యం.
- ఖనిజ మిశ్రమాన్ని దాణాతో కలిపి ఇవ్వడం మంచిది.
- నీటిలో కలిపి ఇస్తే ఖనిజాలు అడుగున చేరతాయి.
- శుభ్రమైన పాత్రలో ఇవ్వాలి. మురుగు కలవకుండా జాగ్రత్తలు పాటించాలి.
- ప్రసిద్ధ కంపెనీల ఉత్పత్తులనే ఎంచుకోవాలి.

**ప్రయోజనాలు**

- పాల ఉత్పత్తి 10 నుంచి 15 శాతం వరకు పెరుగుతుంది.
- పాల నాణ్యత మెరుగవుతుంది. పాలల్లో కొవ్వు శాతం, ఎస్ఎన్ఎఫ్ పెరుగుతాయి.
- ప్రజనన సామర్థ్యం (గర్భధారణ రేటు) పెరుగుతుంది.
- రోగనిరోధక శక్తి పెరిగి, వ్యాధులు తగ్గుతాయి.
- కాల్షియం, ఫాస్పరస్‌లు మిశ్రమంలో ఉండటం వల్ల ఎముకలు బలంగా ఉంటాయి.

**ఆరోగ్య సూచనలు**

- నెలకోసారి పశువైద్యుడిని సంప్రదించాలి.
- స్వచ్ఛమైన నీటిని అందుబాటులో ఉంచాలి.
- గడ్డి, దాణా, ఖనిజాలు సరైన నిష్పత్తిలో ఇవ్వాలి
- పశువులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలి..
- సకాలంలో టీకాలు వేయించడం, క్రిమి సంహారక మందులు ఇవ్వాలి.



## ఆశ్రయం కోల్పోయిన వృద్ధులు



ఆశ్రయం కోల్పోయిన నాగన్న, అప్పాయమ్మ

భీమవరం: కన్న కొడుకే మోసం చేసి నిలువ నీడ లేకుండా చేశాడంటూ భీమవరం పట్టణం నాచువారి సెంటర్‌లోని డోకల నాగన్న, అప్పాయమ్మ దంపతులు వాపోతున్నారు. వీరికి ఉన్న ఇద్దరు కుమారులు, కుమార్తెకు వివాహాలు చేశారు. నాచువారి సెంటర్‌లో వారికి ఉన్న సెంటున్నర స్థలంలో చిన్నపాక వేసుకుని ప్రభుత్వం ఇచ్చే పింఛన్‌తో జీవనం సాగిస్తున్నారు. ఆ ఇంటి స్థలాన్ని చిన్న కుమారుడు సోమేశ్వరరావు బలవంతంగా రాయించుకున్నాడు. ఆ స్థలాన్ని ఇటీవల వేరే వ్యక్తులకు అమ్మివేయడంతో.. వారు నాలుగు నెలల క్రితం ఆ పాకను తొలిగించారు. దీంతో నాగన్న దంపతులకు నిలువ నీడ లేకుండా పోయింది. విషయం తెలుసుకున్న కుమార్తె కె.నాగమణి, అల్లుడు అప్పారావు దంపతులు వృద్ధులకు ఆశ్రయం కల్పించారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్లు స్థానికులు తెలిపారు.

## ఉప్పుటేరు ఆక్రమణలను తొలగిస్తాం



ముంపు గ్రామాలను పరిశీలిస్తున్న మంత్రి సారథి, ఎమ్మెల్యే కామినేని

కైకలూరు: ఉప్పుటేరు ఆక్రమణలను పూర్తిగా తొలగిస్తామని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌తో కలిసి కొల్లేరు ముంపు ప్రాంతాలను బోటులో శుక్రవారం ఆయన పరిశీలించారు. కైకలూరు మండలం పందిరిపల్లిగూడెంలో మంత్రి మాట్లాడుతూ కొల్లేరు వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. ఉప్పుటేరుపై రెగ్యులేటర్ నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే కామినేని మాట్లాడుతూ మూడు వేలు బియ్యం బస్తాలను కొల్లేరు ముంపు గ్రామాలకు కేటాయించినట్టు చెప్పారు. ఈ సందర్భంగా బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా అటవీశాఖాధికారి రవిశంకర్, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, ఆర్డీఓ ఎస్‌కే ఖాజావలి, కొల్లేరు సంఘ నాయకుల బలే ఏసురాజు, కూటమి నేతలు పాల్గొన్నారు.

## స్కూల్ బస్ డ్రైవర్‌పై దాడి

తణుకు టౌన్: స్కూల్ బస్‌కు సైడ్ ఇవ్వాలని హారన్ మోగించిన డ్రైవర్‌పై నలుగురు యువకులు దాడి చేసి గాయపర్చారు. గాయపడిన బస్ డ్రైవర్ తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని తణుకు రూరల్ ఎస్సై ఏజీఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఇరగవరం మండలం కావలిపురం గ్రామానికి చెందిన వాసంశెట్టి వెంకటేశ్వర్లు తణుకులోని ఓ ప్రైవేట్ పాఠశాల బస్సు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం తణుకు నుంచి కావలిపురంలో విద్యార్థులను దించి తిరిగి వెళ్లే సమయంలో రోడ్డుపై బస్సు ముందు రెండు మోటారు సైకిళ్లపై వెళుతున్న యువకులను దారివ్వాలని బస్ డ్రైవర్ హారన్ వేశాడు. దీంతో అసహనం చెందిన యువకులు వేల్పూరు సెంటర్‌లో బస్సును ఆపి డ్రైవర్‌పై దాడి చేశారని ఎస్సై తెలిపారు.



# పులస చిక్కేనా?



సిద్ధాంతంలో అమ్మకానికి ఉన్న పులసలు

పెనుగొండ: చేపల రాజు పులస ఆగమనం కరువై వలకు చిక్కడం లేదు. ప్రతి ఏటా జూన్ నుంచి సెప్టెంబరు వరకు ఇబ్బడిముబ్బడిగా, దీపావళి వరకు అరకొరగా దొరుకే పులస ఇప్పుడు దొరకడం కష్టంగా మారింది. పులసలపై ఆశలు వదులుకొన్న జాలర్లకు, పులస ప్రియులకు మరోసారి వచ్చిన గోదావరి వరద ఆశలను రేకేత్తిస్తోంది. ఆదివారం నాటికి దొరక వచ్చునని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం 200 గ్రాముల నుంచి 300 గ్రాముల వరకు ఉండే చిన్న చేప మాత్రమే చిక్కుతుందని, పెద్ద సైజు ఈ సారి దొరకవచ్చునని భావిస్తున్నారు.

**పులసపై ఎర్రటి జాడ**

సముద్రంలో హిల్సాగా పిలిచే చేప జాతి, గోదావరికి ఎర్రనీరు వచ్చే సమయానికి సుమారు 1200 కిలోమీటర్లు ఈదుకొంటూ గోదావరికి వచ్చి సంతతిని వృద్ధి చేసుకొని తిరిగి సముద్రంలోకి వెళుతుంటాయి. ఈ సమయంలో జాలర్లకు చిక్కి కాసులు కురిపిస్తాయి. పులస కిలో రూ.1500 నుంచి రూ.3 వేల వరకు పలుకుతుంది. సైజు పెరిగే కొద్దీ ఒక్కో పులసను పోటీ పడి పులస ప్రియులు రూ.25 వేలకు కొనుగోలు చేసిన దాఖలాలు ఉన్నాయి. అయితే, ఈ ఏడాది పులసల జాడ కరువవడంతో కిలో రూ.3 వేలు నుంచి అమ్ముతున్నారు. ఎర్రనీరులో ఈదుకొంటూ వచ్చినప్పుడు పులసపై ఎర్రటి జాడ కనిపిస్తుంది. పులసలు తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం నుంచి ప్రారంభమై ఆత్రేయపురం, విజ్జేశ్వరం, సిద్ధాంతం, జొన్నాడ ఆలమూరు వరకు జాలర్ల వలకు చిక్కుతుంటాయి. ప్రస్తుతం ఒరిజనల్ పులస దొరికే పరిస్థితి లేకపోవడంతో ఒడిస్సా నుంచి నకిలీ ఇలసలు పులసల స్థానంలో అమ్ముతున్నారు.

## ప్రాణాలు తీస్తున్న బెట్టింగ్‌లు

ఉంగుటూరు: బెట్టింగులతో ఉంగుటూరు మండలం కైకరం, నారాయణపురం ప్రాంతాల్లో యువకులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇందుకు వారణాసిలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న నారాయణపురానికి చెందిన అన్నదమ్ములు పి.లక్ష్మీనారాయణ, పి.లోక్ వినోద్‌ల మరణ వాగ్మూల సెల్ఫీ వీడియోలే ఉదాహరణ. ఆ వీడియోలు ఉంగుటూరు మండలంలో హల్‌చల్ చేస్తున్నాయి. నారాయణపురం, కైకరం, విజయవాడకు చెందిన పలువురు వ్యక్తులు తమ వద్ద నుంచి రూ.2 కోట్లకు పైగా కట్టించుకుని, ఇంకా వస్తాయని వేధింపులకు గురిచేయడంతో ఆత్మహత్య చేసుకోవాల్సి వచ్చిందని లక్ష్మీనారాయణ, లోక్ వినోద్‌లు తమ వీడియోల్లో వివరించారు. ఈ అన్నదమ్ములు ఏప్రియల్ నెలలో ఇంటి నుంచి వెళ్లిపోగా, చేబ్రోలు పోలీసులు మే 16న మిస్సింగ్ కేసు నమోదు చేశారు. దీనిపై పోలీసులను ప్రశ్నించగా.. వారణాసి నుంచి కేసు ఫైలు వచ్చాక, విచారణలో వాస్తవాలు వెల్లడి కావాల్సి ఉందని చెబుతున్నారు.

## క్లుప్తంగా

### నన్నయ్యలో స్వచ్ఛభారత్


నన్నయ్య క్యాంపస్‌లో స్వచ్ఛ భారత్

**తాడేపల్లిగూడెం:** పట్టణంలోని నన్నయ్య క్యాంపస్‌లో విద్యార్థులు శుక్రవారం స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టారు. పరిసరాలలోని పిచ్చి మొక్కలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.అశోక్ పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకతను వివరించారు.

### వరద బాధితులకు ఆపన్న హస్తం

**తణుకు టౌన్:** విజయవాడ వరద బాధితులకు సహాయం అందించేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధికి తణుకు నియోజకవర్గం నుంచి రూ.1 కోటి 63 లక్షల 77 వేల 261ను అందజేసినట్లు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తెలిపారు. తణుకు నియోజవకర్గంలోని వివిధ సంస్థలు, గ్రామ ప్రజల నుంచి వరద బాధితులకు అందజేసిన విరాళాల మొత్తం చెక్కును శుక్రవారం అమరావతిలో మంత్రి నారా లోకేష్‌కు అందజేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో జనసేన, బీజేపీ, తెదేపా పార్టీలకు చెందిన ముఖ్య నాయకులు పాల్గొన్నట్లు తెలిపారు.

### బాలిక అదృశ్యంపై కేసు నమోదు

**తణుకు టౌన్:** మండలంలోని పైడిపర్రు గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తణుకురూరల్ ఎస్ఐ ఏజీఎస్ఎన్ మూర్తి తెలిపారు. శుక్రవారం బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పైడిపర్రుకు చెందిన బొడ్డి సత్తమ్మ అనే బాలిక ఈనెల 5వ తేదీ నుంచి ఇంటి నుంచి బయటకు వెళ్లి కనిపించకుండా పోయినట్లు బాలిక తల్లి వీరమ్మ ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. బంధువులు, చుట్టుపక్కల గ్రామాల్లో గాలించినా ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గతంలోకూడా ఈ బాలిక మతి స్థిమితం లేకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లిరావడం జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### గణనాయకాయ.. గణదైవతాయ


నిట్‌లో చవితి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

**తాడేపల్లిగూడెం:** గణనాయకాయ, గణదైవతాయ గణాధ్యక్షాయ ధీమహి అంటూ గణేశుని సంకీర్తనలతో వినాయక మండపాలు ప్రతిధ్వనిస్తున్నాయి. నిట్‌లో శుక్రవారం వినాయకచవితి వేడుకలు ఘనంగా జరిగాయి. మహారాష్ట్రకు చెందిన విద్యార్థులు గణపతి బప్పా మోరియా అంటూ భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. నిట్ అధికారి శాస్త్రి , విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### భద్రాచలం ఆర్టీసీ బస్సు ప్రయాణంలో మార్పు

**తణుకు అర్బన్:** తణుకు ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యార్థం తణుకునుంచి భద్రాచలానికి ఏర్పాటు చేసి న అల్ట్రా డీలక్స్ బస్సు సమయంలో మార్పులు చేసినట్లు డిపో మేనేజరు సప్పా గిరిధర్‌కుమార్ తెలిపా రు. ప్రతిరోజూ ఉదయం 6 గంటలకు తణుకు డిపో నుంచి బయలుదేరి తాడేపల్లిగూడెం, నల్లజర్ల, పోతవరం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం, అశ్వారావుపేట, మందపల్లి, సత్తుపల్లి, వీఎం బంజర, యర్రగుంట, చంద్రగుంట, కొత్తగూడెం, పాల్వంచ, బూరుగుంపాడు మీదుగా మధ్యాహ్నం 12.20 గంటలకు భద్రాచలం చేరుతుందని తిరిగి మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరి రాత్రి 8.15 గంటలకు తణుకు చేరుతుందని చెప్పారు. టికెట్ ధర పెద్దలకు రూ. 415లు, పిల్లలకు రూ. 220లు, రిజర్వేషన్ కోసం 94404 19144 నంబరులో సంప్రదించాలని కోరారు.

# విష జ్వరాలు.. వణుకుతున్న జనం

- వర్షాలతో ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు
- ఇందిరమ్మ, వైఎస్సార్ కాలనీలలో వైరల్ జ్వరాలు
- ఆస్పత్రులకు క్యూ కడుతున్న వైరల్ ఫీవర్ బాధితులు

**పెంటపాడు:** వాతావరణంలో వచ్చిన ఆకస్మిక మార్పులతో సీజనల్ వ్యాధులు మండల ప్రజల్ని పట్టిపీడిస్తున్నాయి. మండలంలో మీనవిల్లూరు, ఇందిరమ్మ, వైఎస్సార్ కాలనీల్లో వైరల్ జ్వరాలు అధికమయ్యాయి. జ్వరం, దగ్గు, జలుబు, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, టైఫాయిడ్, మలేరియా వంటి వ్యాధి లక్షణాలతో గ్రామీణ ప్రజలు సతమతమవుతున్నారు. సీజనల్ వ్యాధులు, విష జ్వరాలు ప్రబలి ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. గత నెలలో మీనవల్లూరులో గ్రామంలో డెంగీ కేసు నమోదైంది.

**ఇంటింటి సర్వేలో వైద్య సిబ్బంది**

విష జ్వరాలు ప్రబలుతుండడంతో వైద్య సిబ్బంది అప్రమత్తమయ్యారు. ప్రజల్లో చైతన్యం కలిగించి, రోగాల వ్యాప్తికి కారణమయ్యే దోమల నియంత్రణకు కృషి చేస్తున్నారు. దీనికితోడు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది తమ పరిధిలోని గ్రామాలకు వెళ్లి, ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నారు. దగ్గు, జ్వరంతో బాధపడే వారిని గుర్తించి సత్వరమై అవసరమైన వైద్యం అందించేందుకు తమ వంతు కృషి చేస్తున్నారు. ఇంటి పరిసరాల్లో మురుగునీరు, నిలిచిపోకుండా స్థానికులకు అవగాహన కల్పిస్తున్నారు.

**పారిశుద్ధ్య చర్యలు పూజ్యం**


మురుగుబోదె వద్ద నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

వానాకాలంలో పారిశుద్ధ్య విభాగం పాత్ర కీలకం. ప్రతి వీధిలో డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి.దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్, దోమల మందు పిచికారి చేయాలి. అయితే మండల పరిధిలో ఆచర్యలు నామ్‌కే వాస్తేగా మారాయి. అడపాదడపా దోమల మందు పిచికారి చేసి సరిపెట్టేస్తున్నారు. డ్రైనేజీల్లో పేరుకుపోయిన పూడికల్ని తొలగించే పరిస్థితులే కానరావడం లేదు. దీంతో దోమలు వ్యాప్తి చెంది, ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరపాలని, ప్రజలు పంచాయతీ అధికారుల్ని కోరుతున్నారు. రెండు కాలనీల్లో డ్రైనేజీలు లేక అవస్థలు పడుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ అధికారులను పలు సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. నిలువ ఉన్న మురుగు నీరు తక్షణం పోయే మార్గాన్ని ఏర్పాటు చేయాలన్నారు. తక్షణం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయంపై గ్రామ కార్యదర్శిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా కార్యదర్శి అప్పలరాజు సెలవుపై వెళ్లినట్లు సిబ్బంది తెలిపారు. ఎంతో కాలం నుంచి గ్రామ కార్యదర్శి లేకపోవడం వల్ల గ్రామాల సమస్యలు పట్టించుకోవడం లేదని పేట వాసులు వాపోతున్నారు.


వైఎస్సార్ కాలనీ రోడ్డుపై నీరు నిలిచి పోయిన దృశ్యం


మురుగునీటిని చూపుతున్న మహిళలు

### కాలనీ సమస్యలు పరిష్కరించాలి



గత మూడేళ్ల నుంచి ఈ కాలనీలో సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డు పల్లం కావడం వల్ల వర్షం నీరు ఇంటి ముందు నిలిచిపోతుంది. దీంతో విష సర్పాలు రాత్రి సమయాల్లో తిరుగుతున్నాయి. రాత్రి సమయాలలో పిల్లలతో బయటకు వెళ్లేందుకు భయపడుతున్నాం. – బండి నాగేశ్వరరావు, వైఎస్సార్ కాలనీ, మీనవిల్లూరు.

### పక్కా డ్రెయిన్లు కట్టాలి



డ్రెయినేజీలో మురుగునీరు పారక అక్కడే ఉండిపోతోంది. పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా మురుగు సమస్యను పట్టించుకోవడం లేదు. దోమల ఎక్కువైంది. ప్రతి ఇంట్లో జ్వరాలు వస్తున్నాయి. పక్కా డ్రెయిన్లు కట్టాలి. – గుబ్బల పెద్దింట్లు, ఇందిరమ్మ కాలనీ

### రోడ్లపై నీరు నిల్వ లేకుండా చూడాలి



రోడ్లపై నీరు నిల్వ లేకుండా చూడాలని అధికారులను కోరతున్నారు. వేసవి కాలం నుంచి మేము ఇంటి ముందు మురుగునీటితో ఇబ్బందులు పడుతున్నాం. ఈ వర్షాల వల్ల కాలనీ రోడ్డుపై వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. డ్రెయినేజీలో వాసన వస్తున్నాయని చాలా సార్లు ఫిర్యాదు చేశారు. అధికారులు పట్టించుకోవడం లేదు. – దొమ్మేటి మల్లేశ్వరి, పాత కాలనీ

# ప్రజాసేవకు జీవితాన్ని అంకితం చేసిన ‘ఏచూరి’

**తాడేపల్లిగూడెం రూరల్:** ప్రజాసేవకు జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తి సీతారాం ఏచూరి అని సీపీఎం మాధవరం శాఖ కార్యదర్శి పురిటిగడ్డ జయమ్మ అన్నారు. శుక్రవారం మండలంలోని మాధవరం గ్రామంలో సీపీఎం పార్టీ జాతీయ కార్యదర్శి సీతా రాం ఏచూరి మృతి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జయమ్మ మాట్లాడుతూ సీతారాం ఏచూరి లేని లోటు పార్టీకి తీరనిదని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతీ ఒక్క సభ్యుడిపై ఉందన్నారు. సీపీఎం పార్టీ సభ్యులు గోపాల వెంకట్రావు, గుత్తుల నరసయ్య, నిచ్చెనకోళ్ల రాముడు, కే.సోమరాజు, మల్లుల పరమేశు తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఇటుకులగుంట గ్రామంలో ఇఫ్టూ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు. మల్లిపూడి సీతామహాలక్ష్మి, మాగంటి వెంకటరమణ, పాలుపూరి వెంకటనాగమణి, పి. ధనలక్ష్మి, పాశం వీరమణి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**సీతారాం ఏచూరి మృతి కార్మికవర్గాలకు తీరనిలోటు**

**తణుకు అర్బన్:** రాజ్యసభ సభ్యుడు సీతారాం ఏచూరి మృతి కార్మిక వర్గాలకు, సమాజానికి తీరని లోటని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జిల్లా ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి అన్నారు. సీతారాం ఏచూరి మృతికి తణుకు బార్ అసోసియేషన్ భవనంలో శుక్రవారం ఐలు ఆధ్వర్యంలో సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో తణుకు జిల్లా కోర్టు మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ వెలగల సాయిబాబారెడ్డి, కౌరు వెంకటేశ్వర్లు, సామాజిక న్యాయపోరాట సమితి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గొల్లపల్లి అంబేద్కర్, చోడే గోపీకృష్ణ, డి.భాస్కర్, పి.రమేష్, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎం.మృత్యుంజయరావు పాల్గొన్నారు.


తాడేపల్లిగూడెం మండలం మాధవరం గ్రామంలో సీతారాం ఏచూరికి జోహార్లు అర్పిస్తున్న దృశ్యం

**సీతారామ్ ఏచూరి మృతికి సంతాపం**

**తణుకు టౌన్:** సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి మృతి దేశ వామపక్ష పార్టీలకు తీరని లోటని సీపీఎం పార్టీ నాయకులు సంతాపం తెలిపారు. శుక్రవారం తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలో సాలిపేటలో నిర్వహించిన సీతారామ్ ఏచూరి సంతాప సభలో సీపీఎం వేల్పూరు గ్రామ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు మాట్లాడుతూ సీతారామ్ ఏచూరి బ్రాహ్మణ కుటుంబంలో పుట్టినా సనాతన ధర్మానికి వ్యతిరేకంగా పోరాడిన శ్రమ దోపిడీకి గురువుతున్న పీడిత ప్రజల పక్షాపోరాడిన ఎర్ర జెండా యోధుడని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీ వెంకటేశ్వరరావు, వీ వెంకటేశ్వరరావు, వీ సుబ్బారావు, యండమూరి నాగేంద్ర, వాసా పోశియ్య, కే వీరభద్రరావు, టీ సత్యనారాయణ, పీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


వేల్పూరులో సీతారామ్ ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

**సీతారాం మృతికి సంతాపం.**

**అత్తిలి:** విద్యార్థి ఉద్యమం నుంచి సీపీఎం ప్రధాన కార్యదర్శి స్థాయి వరకు సీతారాం ఏచూరి పనిచేసి దేశంలో కార్మికవర్గ, రైతాంగ వ్యవసాయ కార్మికుల ప్రయోజనాల కోసం తన యావత్ జీవితాన్ని అంకితం చేసిన గొప్ప విప్లవ యోధుడని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కేతా గోపాలన్ అన్నారు. శుక్రవారం అత్తిలి బస్‌స్టేషన్ సెంటర్‌లో మండల సీపీఎం ఆధ్వర్యంలో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి నివాళులర్పించారు. ఈసందర్భంగా కేతా గోపాలన్ మాట్లాడుతూ పీడిత వర్గాల ప్రయోజనాల కోసం పనిచేసిన నాయకుడిని కోల్పోవడం చాలా విచారకరమన్నారు. సీపీఎం నాయకులు కె ధర్మేంద్ర, బి నాగరాజు, పొనుగు వినయ్, నక్క ధర్మయ్య, పి వెంకటేశ్వరరావు, దాయం వెంకన్న, వేడంగి సముద్రయ్య, బంగారు గోపి, కవురు వెంకట నరశింహం, బి రామకృష్ణ పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

**అత్తిలి:** విద్యార్థినిలు ఉన్నత విద్యను అభ్యసించి జీవితలక్ష్యాలను సాధించేవరకు శక్తివంచనలేకుండా పాటుపడాలని ఐసీడీఎస్ అత్తిలి సెక్టార్ సూపర్‌వైజర్ కె కుమారి అన్నారు. పోషణ మహా మాసోత్సవంలో భాగంగా శుక్రవారం అత్తిలి జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో బాల్యవివాహాల నిషేధ చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సూపర్‌వైజర్ కుమారి మాట్లాడుతూ బాల్యవివాహాలు చేయడం వల్ల శారీరక అవయువాలు ఎదుగుదల లేకపోవడం, రక్తహీనత వంటి అనేక అనర్థాలు సంభవిస్తాయన్నారు. ఆడపిల్లకు 18 ఏళ్లు, మగపిల్లలకు 21 ఏళ్లు నిండకుండా బాల్యవివాహాలు చేసిన వారిపై చట్ట ప్రకారం శిక్షార్హులు అవుతారని చెప్పారు. కిశోర బాలికలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం జి విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్ దీపికారాణి, వి పద్మావతి, టి తులసి, కిశోర బాలికలు పాల్గొన్నారు.


అత్తిలిలో బాల్యవివాహాల నిషేధ చట్టంపై అవగాహన ర్యాలీలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ కుమారి

# సమతుల ఆహారంతో ఆరోగ్యం


జగన్నాథపురంలో పోషకాహారంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


కొండ్రుప్రోలు అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ ఎస్తేరు రాణి

**తాడేపల్లిగూడెం రూరల్:** శరీరానికి అవసరమైన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.శ్రీదేవి అన్నారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని జగన్నాథపురం అంగన్‌వాడీ కేంద్రంలో అనుబంధ ఆహారంపై తల్లులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే బాలామృతం, పాలు, గుడ్లు, చిక్కీల ఆవశ్యకతను వివరించారు. ఏఎస్ఎం రాజేశ్వరి, జీఎంఎస్‌కే రజని, అంగన్‌వాడీ టీచర్ తులసీ రాణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే, కొండ్రుప్రోలు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్తేరు రాణి అనుబంధ పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఎటువంటి ఆహారం తీసుకుంటే బిడ్డ ఆరోగ్యంగా ఎదుగుతారనే అంశాన్ని వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సుమలత, వరలక్ష్మి, లక్ష్మి, తల్లులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ వలయంలో తాడేపల్లిగూడెం





పట్టణంలో ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనాలు

- నిబంధనలు పాటించని వాహనదారులు
- రోజురోజుకూ జఠిలమవుతున్న సమస్య
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** తాడేపల్లిగూడెం పట్టణంలో ప్రయాణికులను, వాహనదారులను సమస్యల్లో ట్రాఫిక్ సమస్య పట్టిపీడిస్తోంది. రోడ్ల వెడల్పు, ఫోర్‌లైన్లతో డివైడర్లు ఏర్పాటు చేసినా ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, ఇతర వాహనాలు నిబంధనలు పాటించకోకపోవడంతో తరచూ గూడెంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. రెండో ఫ్లై ఓవర్ ఉన్నప్పటికీ మొదటి ఫ్లై ఓవర్ (కె.ఎస్.రోడ్డు) రహదారిలో రద్దీ పెరిగింది.

**కె.ఎస్.రోడ్డులో సెట్ బ్యాక్ అమలు**

గతంలో పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించేందుకు కె.ఎస్.రోడ్డులో గతంలోని ఎమ్మెల్యేలు కృషి చేసి, రోడ్డుకు ఇరువైపులా సెట్ బ్యాక్ అమలు చేయించారు. అనంతరం సెట్ బ్యాక్‌కు వదలిన స్థలాలను షాపుల యజమానులు, వాటిలో అద్దెకున్నవారు తిరిగి వాటిని వినియోగంలోకి తీసుకోవడంతో సమస్య మొదటికి వచ్చింది. దీనికి తోడు షాపుల వద్ద పార్కింగ్ స్థలం లేకపోవడంతో రోడ్డు మార్జిన్ వరకు తమ వ్యాపారాల కోసం ముందుకు వచ్చారు. ఆ షాపులకు వచ్చే వినియోగదారులు వాహనాలను రోడ్డుపైనే నిలిపి ఉంచుతున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య జఠిలమవుతోంది. సెట్ బ్యాక్‌లు సైతం అమలు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

**జంక్షన్‌లు వద్ద ఇబ్బందులు**

పట్టణంలోని వన్‌టౌన్‌లో బస్సు కాంప్లెక్స్ నుంచి వచ్చే మార్గంలో జీవీ మాల్ జంక్షన్, తాలూకా ఆఫీస్ సెంటర్, ఎన్టీఆర్ జంక్షన్ వద్ద, టూ టౌన్‌లో సైతం పలు జంక్షన్ల వద్ద వేగంగా తమ గమ్యస్థానాలకు చేరాలన్న ఆత్రుతతో ఎవరి వారు ఇష్టం వచ్చిన రీతిలో వాహనాలను నడుపుతున్నారు. ముఖ్యంగా ఆటోలు నడిపే వారు రాంగ్ రూట్లలో వెళుతూ ద్విచక్ర వాహనదారులను, పాదచారులను అయోమయంలో పడివేస్తూ, భయాందోళనకు గురి చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఆటోలు నడిపే వారికి, మోటార్‌సైక్లిస్టులకు తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఇది ఇలా ఉంటే బస్‌స్టాప్‌ల్లో బస్సులు వచ్చే సమయంలో ప్రయాణికులను ఎక్కించుకునేందుకు ఆగిన వాహనాల వల్ల, అదే మార్గంలో ఆటోలను అడ్డంగా పెట్టడంతో ట్రాఫిక్ సమస్య మరింత పెరుగుతోంది. అంతేగాక పలు అంతర్గత రహదారుల్లోనూ ముఖ్యంగా రైల్వే స్టేషన్ రోడ్డు, జూబ్లీ రోడ్డు, శేషమహల్ రోడ్డు, రూరల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లే రహదారుల్లో వాహనదారులు వారి ఇష్టం వచ్చినట్లు నిబంధనలు పాటించకపోవడంతో ట్రాఫిక్ జఠిలంగా మారుతోంది. టూ టౌన్‌లో సైతం పోలీస్ ఐలాండ్ వద్ద, స్థానికంగా తణుకు రోడ్డు మార్గంలో, భీమవరం వైపు, ఏలూరు వైపు మార్గాల్లోనూ సాయంత్రం సమయంలో ట్రాఫిక్ మరింత పెరిగి వాహనదారులు, పాదచారులు, విద్యార్థులు పలు ఇక్కట్లు పడుతున్నారు. ట్రాఫిక్ సమస్యను అరికట్టాలను పలువురు పాదచారులు, ద్విచక్ర వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

### ట్రాఫిక్ నిబంధనలు పాటించే విధంగా చూడాలి



ట్రాఫిక్ సమస్యను నియంత్రించడానికి ద్విచక్ర వాహనదారులు, ఆటోలు నడిపేవారు, ఇతర వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించే విధంగా చూడాలి. ప్రధాన మార్గాల్లో వాహనదారులు వారి ఇష్టం వచ్చిన రీతిలో వాహనాలను నడపడంతో ప్రజలు, ముఖ్యంగా పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ సమస్య జఠిలం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– వై.శ్రీను, మేస్త్రి, తాడేపల్లిగూడెం

# ట్రిపుల్ ఎఫ్ ఆధ్వర్యంలో ఆర్వో ప్లాంట్‌ల ఏర్పాటు

**పెంటపాడు:** మండలంలోని ట్రిపుల్‌ఎఫ్ కర్మాగారం , స్వాభిమాన్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం పలు సేవా కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా జువ్వలపాలెంలో మినరల్‌వాటర్ ప్లాంట్ ఏర్పాటు, ప్రత్తిపాడు చమటచెరువు వద్ద ప్లాంట్ ఏర్పాటుకు శంకుస్థాపన కార్యక్రమాలు జరిగాయి. సుమారు రూ.13 లక్షల వ్యయంతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ట్రిపుల్‌ఎఫ్ కర్మాగార ప్రతినిధి ఓపీ గోయంకా తెలిపారు. ప్రజలకు మరిన్ని సేవాకార్యక్రమాలు తమ సంస్థ తరపున చేసేందుకు సంసిద్ధంగా ఉన్నామన్నారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఈ కార్యక్రమాలను ప్రారంభించారు. ట్రిపుల్ కర్మాగార ప్రతినిధులు జనరల్ మేనేజర్ జనార్థన్, సహాయ మేనేజర్ శ్రీనివాస్, స్వాభిమాన్ ట్రస్టు ప్రతినిధి వేమల శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్, ప్రత్తిపాడు గ్రామ కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

### పోక్సో కేసులో ఆరేళ్ల జైలు

**ఆకివీడు:** స్థానిక మాదివాడకు చెందిన రౌడీ షీటర్ మద్దా సుందర్ సింగ్‌కు పోక్సో కేసులో ఆరు సంవత్సరాలు జైలు శిక్షను విధిస్తూ పోక్సో కోర్టు జడ్జి ఎం.ఏ. సోమశేఖర్ శుక్రవారం తీర్పు చెప్పినట్లు ఎస్సై హనుమంతు నాగరాజు చెప్పారు. 2017 సంవత్సరంలో బాలికపై అత్యాచార సంఘటనపై అప్పటి ఎస్సై సుధాకరరెడ్డి కేసు నమోదు చేశారు. పోక్సో చట్టం క్రింద కేసు నమోదు చేసి పోక్సో కోర్టులో హాజరుపరిచారు. వాదోపవాదాలు అనంతరం శిక్ష విధిస్తూ తీర్పు చెప్పినట్లు ఎస్ఐ నాగరాజు చెప్పారు.

### నిత్యావసరాల అందజేత

**ఉండి:** మనకు కలిగిన దానిలో నుండి కొంత మొత్తాన్ని నిరుపేదలు, ఆపదలో ఉండే వారి కోసం దానం చేసి ధన్యులమవుతామని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మండల కార్యదర్శి గాదిరాజు రంగరాజు, కో–చైర్మన్ దంగేటి రామలింగేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఉండి మండలం చెరుకువాడలో నిరుపేద పూరిళ్ల సత్యనారాయణ దంపతులకు నెలకు సరిపడా నిత్యావసరాలను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు మాన్యం వాసు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### ఆక్రమణల తొలగింపు

**కాళ్ల:** మండలంలోని పెదఅమీరం గ్రామంలో మురుగు కాలువను ఆనుకుని ఉన్న ఆక్రమణలు తొలగింపు పనులు అధికారులు శుక్రవారం ప్రారంభించారు. గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహం నుంచి ఆక్రమణల తొలగింపు పనులు ఇరిగేషన్, డ్రెయినేజీ, రెవెన్యూ అధికారుల సమక్షంలో చేపట్టారు. మురుగు కాలువ ఆనుకొని ఉన్న ఆక్రమణలు తొలగింపు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. తహసీల్దార్ నాగార్జున, డ్రెయినేజీ ఏఈ జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.